RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 269 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | మంగళవారం, 2 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## ఇచ్చిన మాట ప్రకారం...

# రైతు రుణమాఫీ

## తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ శుభవార్త..!

### ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ




### రూ.2 లక్షల రుణమాఫీకి విధివిధానాలు..!

హైదరాబాద్ : తెలంగాణ రైతు సోదరులకు రేవంత్ సర్కార్ తాజాగా ఆసక్తికరమైన వార్తను అందించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో రైతు రుణమాఫీ కూడా ఒకటి. ఈ నేపథ్యంలోనే కోట్ల రూపాయలను రుణమాఫీ చేసేందుకు సమగ్ర విధి విధానాలను రూపొందిస్తున్నట్లుగా కాంగ్రెస్ సర్కార్ ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఒక్కో రైతుకు ఒక్కో సందర్భంలో రూ. 2 లక్షలు రుణమాఫీ ఇవ్వనున్నారు. ఇక ఈ విధానాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులతో కొనసాగుతున్న సహకారం గురించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైతు రుణమాఫీ కార్యక్రమం తెలంగాణ రైతు సోదరులకు మరింత భరోసాని అందిస్తోందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన కీలక వాగ్దానమైన రుణమాఫీని దృష్టిలో ఉంచుకొని దానికి సంబంధించి ప్రత్యేక విధానాలు , మార్గదర్శకాలకు ప్రభుత్వం చురుగ్గా కార్యచరణ చేస్తుందని ఈ క్రమంలోనే ఒక్కో రైతుకు 2 లక్షల రుణమాఫీ తెలంగాణలోని ప్రతి వ్యవసాయ వర్గాలకు ఆశాజ్యోతి గా నిలుస్తుంది అని చెప్పుకొచ్చారు.

వ్యవసాయ ప్రగతికి కాంగ్రెస్ సర్కార్ ఎప్పుడు కట్టుబడే ఉంటుందని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. అయితే గత ప్రభుత్వం నుండి వచ్చిన ఆర్థిక పరిస్థితులు సవాల్లతో కూడుకున్నప్పటికీ రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టిన ప్రభుత్వం రుణమాఫీ ఇవ్వడానికి దృఢంగా వ్యవహరిస్తుందని తెలియజేశారు. ఈ నేపథ్యంలోనే రుణమాఫీకి కోటి రూపాయలకు సంబంధించిన విధివిధానాల రూపకల్పన కొనసాగుతుందని తుమ్మల ప్రకటించారు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో 2 లక్షల రుణమాఫీ ఉంటుందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం లోక్ సభ ఎన్నికలు నియమాలకు కట్టుబడి ఉండడం వలన ల ఎన్నికల తర్వాత ఈ చొరవకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రకటిస్తామని తెలియజేశారు. అలాగే రుణమాఫీ కార్యక్రమం తో పాటు రైతుబంధు నిధుల పంపిణీ పై కూడా గణనీయమైన పురోగతి ఉంటుందని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు. గణనీయమైన సంఖ్యలో రైతులు ఇప్పటికే యాసంగి సీజన్ కు సంబంధించిన రైతుబంధు నిధులు పొందారని , కేటాయించిన నిధులలో 92.68 శాతానికి పైగా రైతుల బ్యాంకులో జమ చేయబడ్డాయని చెప్పుకొచ్చారు. ఇది గత ప్రభుత్వ పరిపాలనతో పోలిస్తే గణనీయమైన అభివృద్ధి అని సూచించారు. ఇది అర్థవంతమైన ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తేల్చి చెప్పారు.

ఈ నేపథ్యంలోనే ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను ఉద్దేశించి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు సంక్షేమం విషయంలో రాజకీయ అవకాశవాదం ఉందని విమర్శించారు. ఈ తరుణంలోనే గత వాగ్దానాలు మరియు చర్యల మధ్య అసమానతల గురించి ఆయన చెప్పుకొచ్చారు. మరి ముఖ్యంగా రైతుబంధు నిధులు ఆలస్యం, రైతు రుణమాఫీకి సంబంధించి వ్యవహారం, కరువు పరిస్థితులు వంటి వాటిపై వాస్తవమైన ఆందోళనలను రాజకీయం చేసే ప్రయత్నాలను ఆయన కొట్టివేశారు. ఇక కార్యక్రమం ముగింపులో ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల రుణమాఫీ కచ్చితంగా రైతులకు చేరుతుందని వ్యవసాయ సంక్షేమం మరియు గ్రామీణ అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పుకొచ్చారు.



## మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు వాయిదా

మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు వాయిదా పడింది. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన ఈ ప్రక్రియను జూన్ 2వ తేదీకి వాయిదా వేయాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. గత గురువారం ఈ స్థానానికి ఉప ఎన్నిక పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా పరిధిలో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పురపాలక సంఘాల కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎక్స్‌అఫీషియో సభ్యులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన ఎమ్మెల్సీకి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. మన్నె జీవన్‌రెడ్డి(కాంగ్రెస్), నవీన్‌కుమార్‌రెడ్డి (భారాస), సుదర్శన్‌గౌడ్ (స్వతంత్ర అభ్యర్థి) బరిలో ఉన్నారు.

## జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ ఖేల్ ఖతం..?



హైదరాబాద్ : రోజు రోజుకు బీఆర్ఎస్ పరిస్థితి దారుణంగా తయారవుతోంది. నమ్ముకున్న నేతలే పార్టీని నట్టేట ముంచి వెళ్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని కడియం శ్రీహరికి టికెట్ ఇచ్చినా.. ఆయన కూడా పార్టీని వీడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాకుండా.. సీనియర్ నాయకులు కే.కేశవరావు లాంటి నేతలు సైతం పార్టీని వీడటంతో పార్టీ మరింత బలహీన పడుతోంది. అయితే.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ప్రాంతంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన స్థావరాన్ని విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్ఎంసీ పరిధిలోని 29 ఎమ్మెల్యే స్థానాలకుగానూ కాంగ్రెస్ కేవలం మూడింటిని మాత్రమే గెలుచుకోగలిగింది. అయితే వచ్చే లోక్ సభ ఎన్నికల్లో గ్రేటర్ మొత్తం క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు లోక్‌సభ స్థానాలనూ కైవసం చేసుకోవాలనే ఆశయంతో కాంగ్రెస్ ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నుంచి స్థానిక నేతలను ఆహ్వానిస్తోంది. మాజీ మేయర్ బొంతు రామ్ మోహన్ రెండు నెలల క్రితం పార్టీలో చేరారు. ఆయన తర్వాత ప్రస్తుత డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఉన్నారు. నిన్న ప్రస్తుత మేయర్ విజయలక్ష్మి గద్వాల్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరి ఎన్నికలకు ముందు గ్రేటర్‌లో బీఆర్ఎస్‌ను బలహీనపరిచారు. ఒక్కసారిగా హైదరాబాద్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ చేరికతో కాంగ్రెస్ బలపడింది. 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం రెండు సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మరో ఎనిమిది మంది కార్పొరేటర్లు పార్టీలో చేరి మొత్తం 10కి చేరగా.. రానున్న రోజుల్లో మరో 15 మంది కార్పొరేటర్లు చేరనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మరో 10 మంది ఎమ్మెల్యేలను ఆహ్వానించి ఆ ఎమ్మెల్యేల నియోజకవర్గాల కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరే యోచనలో రేవంత్ ఉన్నట్లు సమాచారం. ఈ విధంగా హైదరాబాద్‌లో కాంగ్రెస్ మెల్లమెల్లగా తన పునాదిని పెంచుకుంటుండగా, నగరంలో అగ్రరాజ్యంగా ఉన్న బీఆర్ఎస్ శరవేగంగా నష్టపోతోంది.

## కాంగ్రెస్ వర్సెస్ బిజెపి

# ఏందీ లొల్లి!



### నాయకుల మధ్య మాటల తూటాలు...!

### కూల్చివేత'పై కుతకుతలాడుతున్న రాజకీయం!!

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందన్న వ్యాఖ్యలు మరోసారి దుమారం రేపాయి. రెండు జాతీయ పార్టీల నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లకు కారణమయ్యాయి. బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేయాలని చూస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి 48 గంటలు చాలంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించడంతో వివాదం మొదలైంది. అంతేకాదు.. ఆరుగురు మంత్రులు బీజేపీతో టచ్‌లో ఉన్నారనడం.. ఏక్‌నాథ్ షిండే తరహాలో ఇక్కడ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యవహరించేందుకు సిద్ధమయ్యారనడం.. కోమటిరెడ్డి కేంద్ర మంత్రులు గడ్కరీ, అమిత్ షాలను కలిశారనడం కలకలం రేపింది.

దీనితో ఇంతకుముందు బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందంటూ చేసిన వ్యాఖ్యలు మళ్లీ తెరపైకి వచ్చాయి. అధికార పార్టీ నేతలను బీజేపీ టచ్‌లోకి తెచ్చుకుంటోందంటూ ప్రచారం మొదలైంది. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ ఘాటుగా స్పందించారు. బీజేపీ పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చిందని, కానీ ఇక్కడ అలా సాధ్యం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

ఏలేటి వ్యాఖ్యలు మోదీ, అమిత్ షాల ఆలోచన తీరును తెలియచేస్తున్నాయని విమర్శించారు. "నిన్నటి వరకు బీఆర్ఎస్ వాళు ఈ పాట పాడారు. ఇప్పుడు బీజేపీ వాళ్లు ఎత్తుకున్నారు. దమ్ముంటే టచ్ చేసి చూడండి.. ఏం జరుగుతుందో తెలుస్తుంది.." అని సవాల్ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. దమ్ముంటే అమిత్ షా, గడ్కరీలను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి తీసుకుని వచ్చి ప్రమాణం చేయించాలని, తాను కూడా ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ చేశారు. మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తానంటే ఎవరూ స్పందించకపోయేసరికి ఇలా తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక ఏలేటి వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

ఏదో నోటికి వచ్చినట్టు మాట్లాడటం సరికాదని, అనవసర ఆరోపణలు పద్ధతికాదని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లూ అధికారంలో ఉండి ప్రజలకు సేవ చేస్తుందన్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## వాలంటీర్లపై సీఈసీ ఆంక్షలు ఎఫెక్ట్ ఎవరిపై పడనుంది?

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏపీలో వాలంటీర్ వ్యవస్థ అత్యంత ఆసక్తికరమైన టాపిక్ గా ఉన్న సంగతి తెలిసిందే. పైకి ఎన్ని చెబుతున్నా.. విపక్షాలకు కూడా వాలంటీర్ల విషయంలో లోలోన ఒకరకమైన ఆందోళన ఉండనే ఉందని చెబుతుంటారు. ఇటీవల కాలంలో టీడీపీ నేతలు చేసిన ఆరోపణలు, దిద్దుబాటు చర్యలు ఈ కోవలోకే వస్తాయని చెబుతున్నారు. ఆ సంగతి అలా ఉంటే... తాజాగా వాలంటీర్లపై సీఈసీ ఆంక్షలు విధించింది. అవును... సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించింది. ఇందులో భాగంగా... ఎటువంటి సంక్షేమ పథకాలకూ వాలంటీర్ల చేత డబ్బు పంపిణీ చేయించవద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో... ఈ కోడ్ ప్రభావం వాలంటీర్లపై పడింది! ప్రభుత్వ సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా అందజేసేందుకు ఈ వ్యవస్థను రూపొందించిన సంగతి తెలిసిందే. అయితే... ఈ సేవలు ఓటర్లపై ప్రత్యక్షంగా ప్రభావం పడే అవకాశం ఉందని టీడీపీ నేత వర్ల రామయ్య, నిమ్మగడ్డ రమేష్ లు ఎన్నికల కమిషన్ వద్ద పిటిషన్ దాఖలు చేశారు. దీంతో... ఈ పిటిషన్లపై స్పందించిన ఎన్నికల కమిషన్... ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం.. వాలంటీర్లపై తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా... సంక్షేమ పథకాలకు వాలంటీర్లతో డబ్బులు పంపిణీ చేయించొద్దని ఆదేశించింది. ఇదే సమయంలో ఎన్నికల కోడ్ ముగిసేవరకూ వాలంటీర్లకు ఇచ్చిన మొబైల్ ఫోన్లను, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు ఈ క్షణం నుంచే అమలు కానున్నట్లు తెలిపింది. ఇదే సమయమంలో... సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వాన్ని సూచించింది. దీంతో... ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇచ్చే పెన్షన్ ను వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందించే అవకాశం లేదు! జూన్ 4 ఎన్నికల ఫలితాలు విడుదల అయ్యి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే వాలంటీర్ల సేవలపై ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో... ప్రధానంగా ఏప్రిల్, మే నెలల్లో పించన్లను ఎలా అందిస్తారనేది ఆసక్తిగా మారింది. ఈ ఎఫెక్ ఎవరిపై పడుతుందో అనే చర్చ కూడా మొదలవ్వడం గమనార్హం!

## పెరుగుతున్న ఔషధ వినియోగం



కరీంనగర్ : ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాల వినియోగం పెరుగుతోంది.. వైద్య కళాశాలల ఏర్పాటు, మాతాశిశు కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాలతో సదుపాయాలు పెరిగి జనం రాక పెరగడమే ఇందుకు కారణం. గతంతో పోల్చితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను విరివిగా వినియోగించుకుంటున్నారు.

కొవిడ్ సమయంలో అత్యధికం

కొవిడ్ కన్నా ముందు రూ.5 నుంచి రూ.6 కోట్ల విలువైన ఔషధాలు సరఫరా అయ్యేవని స్టోర్స్ అధికారులు తెలిపారు. 2021-22లో కొవిడ్ వల్ల అత్యధిక ఔషధ వినియోగం జరిగింది. ఆ సమయంలో రూ.12.93 కోట్ల విలువైన ఔషధాలు వినియోగించారు. 2022-23 సంవత్సరానికి రూ.6.76 కోట్ల విలువైన మందులు అందించగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.25 కోట్ల మందులు ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు రూ.2 కోట్ల ఔషధాలు అధికంగా సరఫరా అయ్యాయి.

ఇంటింటికీ సరఫరా

రక్తపోటు, మధుమేహం వంటి వాటితో బాధపడేవారిని వైద్య, ఆరోగ్యశాఖ సర్వే ద్వారా గుర్తిస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గుర్తించిన వారందరికీ నెల నెలా మాత్రలు ఆశా కార్యకర్తలు స్వయంగా ఇంటికి వెళ్లి అందిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ ద్వారా వీటిని అన్ని జిల్లాల వైద్యారోగ్యశాఖ కార్యాలయాలకు పంపిస్తే అక్కడి నుంచి బాధితులకు చేరుస్తారు. క్షయ, కుష్ఠు బాధితులకు కూడా మల్టీ డ్రగ్ థెరపీ విధానంలో ప్రత్యేక కిట్లను అందిస్తారు.

పెద్దాసుపత్రుల్లో ఎక్కువ

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి కరీంనగర్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగుల రాక ఎక్కువ. గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల, జగిత్యాల, రామగుండం, కరీంనగర్‌లలో ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేశారు. బోధన ఆసుపత్రుల్లో పలు విభాగాల వైద్యులు అందుబాటులో ఉండటం, వైద్య వసతులు మెరుగు పడటం వల్ల రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఈ ఆసుపత్రులకు అభివృద్ధి కమిటీలు కూడా ఉన్నాయి. అత్యవసరమైన మందులు కమిటీ ఆమోదంతో కొనుగోలు చేసి వైద్యం అందిస్తున్నారు. కరీంనగర్ ప్రధాన ఆసుపత్రికి ప్రతీ వారానికోసారి, మిగిలిన మూడు జిల్లాల వైద్య కళాశాలల ఆసుపత్రులకు 15రోజులకు పంపిణీ చేస్తున్నారు. మిగిలిన ఆసుపత్రులకు నెలకోసారి పంపిస్తున్నారు.

రెండు జిల్లాలకు ఒక గోదాము

వైద్య కళాశాలలు, ఆసుపత్రుల ఆధునికీకరణ, మాతాశిశు కేంద్రాల వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధ వినియోగం పెరుగుతోంది. వచ్చే స్టాక్ నిల్వ చేసేందుకు గోదాములు సరిపోవడం లేదు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఉంది. ఇదేకాకుండా కొత్తపల్లి వైద్య కళాశాల వద్ద కూడా గోదాము ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో కొత్త భవనం నిర్మించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ భవనం ప్రారంభం కాగానే రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు జగిత్యాల నుంచి మందులు సరఫరా అవుతాయి. కరీంనగర్, పెద్దపల్లికి కరీంనగర్ నుంచి వెళ్తాయి. ప్రభుత్వం ఏటా కేటాయించిన కోటా ప్రకారం మందులను ఆయా ఆసుపత్రులకు వాహనాల ద్వారా ఏ సమస్య లేకుండా సరఫరా చేస్తున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

## భారత్ బ్రాండ్ పేదలకు దూరం




కరీంనగర్ : పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలతో సామాన్యులు పడుతున్న ఇబ్బంది నుంచి కొంత ఉపశమనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్ బ్రాండ్ పేరుతో రాయితీపై నిత్యావసర సరకులను అందిస్తోంది. ఈ బ్రాండ్ కింద ఉల్లిగడ్డ ధర పెరిగిన సమయంలో రాయితీపై ఉల్లిగడ్డను విక్రయించారు. దీని ధర తగ్గడంతో ప్రస్తుతం శనగపప్పు, గోధుమ పిండి, బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం బాగున్నా.. ఆచరణలో పూర్తి స్థాయిలో పేదలకు చేరడం లేదు. సరకుల విక్రయాలను మొబైల్ స్టోర్స్‌పేరిట అడపాదడపా వాహనాలపై పెట్టి విక్రయిస్తున్నారు. ఆ మొబైల్ వాహనం విక్రయించే సమయంలో అక్కడ అందుబాటులో ఉన్నవారికి రాయితీ సరకు దక్కుతోంది.

పేదల కడుపు నిండేదెప్పుడు?

బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భారత్ బియ్యం పేరిట రూ.29కే కిలో బియ్యం చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.50 నుంచి రూ.60ల వరకు వాటి రకాలను బట్టి విక్రయిస్తున్నారు. భారత్ బియ్యం కిలో రూ.29కే విక్రయిస్తుండటం సామాన్యులకు ఊరటే. కానీ.. క్షేత్రస్థాయిలో ఆచరణలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. భారత్ బియ్యం జిల్లాలో ఓ పేరొందిన స్టోర్స్‌లో మాత్రమే లభిస్తున్నాయి. ఈ బియ్యం వచ్చిన ఆ స్టాక్ ఆన్‌లైన్ విక్రయాలకే సరిపోతోందని ఆ నిర్వాహకులు కొనుగోలుదారులకు చెబుతున్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు భారత్ బియ్యం కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోతోంది. సామాన్య ప్రజలు సరకులను సమీపంలోని కిరాణం దుకాణాలు, రైతు బజార్లలో కొనుగోలు చేస్తారు కానీ.. పేరొందిన స్టోర్స్‌కు వెళ్లే అవకాశాలు తక్కువ. దీంతో ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన ఉన్నత కుటుంబాలకే ఈ బియ్యం అందుతోంది.

మొబైల్ స్టోర్స్ వద్దు.. రైతు బజార్లు ముద్దు

మొబైల్ స్టోర్స్ విక్రయాల పేరిట జరుగుతున్న మోసాన్ని అరికట్టాలంటే స్థిరమైన వ్యాపారులకు భారత్ బ్రాండ్‌ను విక్రయించడానికి అవకాశం కల్పించాలి. ప్రజలు ఎక్కువగా సందర్శించే రైతు బజార్లు, కూరగాయల మార్కెట్‌లలో వీటిని అందుబాటులో పెట్టాలి. ప్రైవేట్ వ్యాపారులకు బదులు మార్కెటింగ్ అధికారుల పర్యవేక్షణ ఉండే రైతు బజార్లలో స్థిరమైన దుకాణాలను ప్రారంభించి విక్రయిస్తే సామాన్యులకు బియ్యం అందే వీలుంటుంది.

వాహనాలపై విక్రయం..

భారత్ బ్రాండ్ కింద ఫిబ్రవరి నుంచి బియ్యం, శనగపప్పు, గోధుమ పిండి విక్రయిస్తున్నారు. ఈ సరకులను వాహనాలపై పెట్టి రద్దీగా ఉన్న ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించే సమయంలో కొనుగోలు దారుల నుంచి ఫోన్ నంబరు సేకరించాల్సి ఉంటుంది. ఒక్కరికి ఒక ప్యాకెట్ మాత్రమే ఇవ్వాలి. గడిచిన రెండు నెలల్లో వేళ్లపై లెక్కించే మేరకే వాహనాలపై సరకులను విక్రయించారు. ఆపై వాటి ఉనికే లేకుండా పోయింది. శనగపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.90ల నుంచి రూ.110ల వరకు వాటి నాణ్యతను బట్టి అమ్ముతున్నారు. భారత్ బ్రాండ్ కింద విక్రయిస్తున్న శనగపప్పు రూ.60కే అందిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు 62 క్వింటాళ్లు చేరుకున్నట్లు సమాచారం. పప్పు మొబైల్ స్టోర్లలో విక్రయించాల్సి ఉండగా నగరంలోని హోల్‌సేల్ వ్యాపారులకు గంపగుత్తగా రూ.54కు కిలో చొప్పున విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని టిఫిన్ సెంటర్లు, హోటళ్లకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎన్నికల ప్రచారానికి ఆన్‌లైన్ అనుమతులు

కరీంనగర్ : ఎన్నికల్లో ఓటింగ్ శాతం, పారదర్శకత పెంచేందుకు ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ముఖ్యంగా సాంకేతికత వినియోగంపై దృష్టి సారించింది. రాజకీయ పార్టీల నాయకుల ప్రచార అనుమతులకు 'సువిధ' పోర్టల్‌ను సీఈసీ అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచార అనుమతులు పొందేందుకు ఈ పోర్టల్ దిక్సూచిగా ఉపయోగపడనుంది. ప్రజాప్రతినిధులకు ఆసక్తి, అవగాహన లేకపోవడంతో వినియోగం తగ్గింది. దీంతో అధికారులు గత శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించి ఏర్పాట్లు చేశారు. కేంద్రం వద్ద సంబంధిత బ్యానర్లు ఏర్పాటు చేసి అవసరమైన వివరాలు తెలియజేస్తున్నారు. 'సువిధ' పోర్టల్ పనితీరుపై కథనం.

సువిధ పోర్టల్‌లో..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు ప్రచారం కోసం అనుమతికి సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ముందుగా %suvidha.eci.gov.in% వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ నంబర్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం 48 గంటల్లోపు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే నోడల్ అధికారులుగా ఉన్న పోలీసు, రెవెన్యూ, ఆర్టీఏ అధికారులు తమ రిమార్కులు నమోదు చేస్తారు. అనంతరం వాటికి అనుగుణంగా ప్రచారానికి అనుమతి లేదా తిరస్కరణ అనే విషయాన్ని తెలియజేస్తారు. ఒకవేళ అనుమతి ఇస్తే రాతపూర్వకంగా ధ్రువీకరణపత్రం అందజేస్తారు.

నియోజకవర్గాల్లో మానిటరింగ్ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కరీంనగర్, చొప్పదండి, హుస్నాబాద్, మానకొండూర్, హుజూరాబాద్, రాజన్న




సిరిసిల్ల, వేములవాడ శాసనసభ నియోజకవర్గాలు.. పెద్దపల్లిలో మంథని, పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం.. నిజామాబాద్ పరిధిలో జగిత్యాల, కోరుట్ల ఉన్నాయి. శాసనసభ స్థానాలు ఉండే జిల్లాల్లో సువిధ మానిటరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలోనూ దరఖాస్తుల నమోదు, అనుమతులు వివరాలు పరిశీలిస్తారు. కరీంనగర్ జిల్లాలో 20 ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆరింటికి అనుమతులు ఇచ్చామని మిగిలినవి పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

వీటికి దరఖాస్తు చేసుకోవాల్సిందే..

ర్యాలీలు, ప్రదర్శనలు
సభలు, సమావేశాల నిర్వహణ
తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాటు
లౌడ్ స్పీకర్ల ఏర్పాటు
వాహనాల అనుమతులు
హెలిప్యాడ్లు, హెలికాప్టర్ల వినియోగం

## కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై మత్స్యకారులకు అవగాహన



**తాండూర్, ఏప్రిల్1(ప్రభాత సమాచారం)**
మత్స్య సంపద యోజన లో భాగంగా మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ నేషనల్ ఫిషరీస్ అధ్యక్షులు జయదీప్ పాటిల్ ఆధ్వర్యంలో తాండూరు లో మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశములో మస్త్యకరుల తోపాటు మల్టీ స్టేట్ కోపరేటివ్ అధ్యక్షులు పూలబోయిన భీమన్న, అలాగే ఫిషరీష్ జిల్లా వైస్ చైర్మన్ కంపెల చిన్నయ్య, మల్టీస్టేట్ కోఆపరేటివ్ తాండూర్ కోఆర్డినేటర్ రెవెల్లి శ్రీనివాస్, మచ్చ కారులు పెద్దబోయిన మహేష్, కంపెల శ్రీనివాస్, పెద్దవైన శంకర్, పెద్దబోయిన రవి, ఉప్పుట్ల చంద్రశేఖర్, ఉప్పర్ల సంతోష్, మేడి శంకర్, మేడి సునీత, మేడి మల్లేశ్వరి,పెద్దబోయిన శ్రావణి, పెద్ద బోయిన సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## అచలాపూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**తాండూర్, ఏప్రిల్1(ప్రభాత సమాచారం)**
తాండూర్ మండలం అచలాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాండూర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రమును సోమవారం తాండూర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ టి మురళీధర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యమును దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రంలో రైతులు వరి ధాన్యమును అమ్మినట్లయితే వరికి మద్దతు ధర లభించి రైతుకు లాభం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ధనలక్ష్మి, సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి కొంత.. అక్రమమే ఎక్కువ

సిరిసిల్ల : జిల్లాలో స్థానిక అవసరాలు, గృహ, ప్రభుత్వ నిర్మాణాలకు 2019 డిసెంబరు నుంచి ఇసుక తవ్వకాలకు వే బిల్లులను జారీ చేస్తున్నారు. దీనికోసం మానేరు, మూలవాగుల్లో ఏడు ప్రాంతాల్లో క్వారీలను గుర్తించారు. వీటిలోనే 12 మండలాలు, రెండు పట్టణాలకు రెవెన్యూశాఖ వారంలో ఒక రోజు వేబిల్లులు జారీ చేస్తుంది. క్యూబిక్ మీటరుకు రూ.100 చొప్పున ఒక్కో ట్రాక్టర్‌కు మూడు క్యూబిక్ మీటర్లకు రూ.300 చెల్లించాలి. దీనిద్వారా రెవెన్యూ శాఖకు ఏటా రూ.2 కోట్ల మేరకు ఆదాయం సమకూరుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఇసుక తవ్వకాలు, తరలింపులోనే సమస్య అంతా. ఒకదానికి వేబిల్లు తీసుకొని ట్రిప్పుల కొద్దీ అక్రమంగా తీసుకెళ్తున్నారు. సాయంత్రం అయిదింటిలోపే తవ్వకాలు జరపాలి. చాలా చోట్ల అర్ధరాత్రి అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. ఇవి హద్దులు మీరడంతో ఇటీవల ముస్తాబాద్, సిరిసిల్లలో పోలీసులు కేసులు నమోదు చేశారు. గతంలోనూ ఇల్లంతకుంట మండలంలో ఇసుక అక్రమార్కులపై పీడీ యాక్టు కూడా నమోదైంది. పర్యవేక్షణ లేక...వేబిల్లు రసీదుపై రవాణా తేదీలు, సమయాన్ని నమోదు చేస్తారు. నిర్ణీత గడువులోగా ఇసుక రవాణా చేపట్టకుంటే ఆ రసీదు చెల్లదు. ఈ వివరాలను క్వారీల వద్ద రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేసి ఇసుక లోడింగ్‌కు అనుమతించాలి. నిర్ణీత తేదీ, సమయంలో ట్రాక్టర్‌కు 3 క్యూబిక్ మీటర్ల ఇసుకనే తరలిస్తున్నారా? లేదా? అనేది పరిశీలించాలి. అక్రమాలు జరగకుండా చూడాలి. కాగా జిల్లాలో ఏ క్వారీ వద్ద తనిఖీలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. క్వారీలను గుర్తించిన పంచాయతీలు ప్రత్యేక వసూళ్లకు పాల్పడుతుండటంతో అక్రమాలకు అడ్డూ, అదుపూ లేకుండా పోతోంది. దీంతో వాగులో రెండు మీటర్ల లోతుకు మించి తవ్వకాలు చేపట్టరాదు. అలాగే ట్రాక్టరుకు మూడు క్యూబిక్ మీటర్లు తరలించాలి. కానీ ఒక్కో ట్రాక్టర్‌లో అయిదు నుంచి ఆరు క్యూబిక్ మీటర్లు తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకు ఒక వంతు సరఫరా చేస్తే మిగతాదంతా నిల్వ చేసి సిద్దిపేట, కరీంనగబ్, కామారెడ్డి జిల్లాలకు తీసుకెళ్తున్నారు. వేబిల్లులతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కన్నా అక్రమ రవాణాతో అంతకు రెండింతలు నష్టం ఏర్పడుతుందనే విమర్శలున్నాయి.

భూగర్భ జలాలపై ప్రభావం

ప్రస్తుతం మధ్యమానేరులో 9.5 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల అంతంత మాత్రమే. మళ్లీ వర్షాకాలం వరకు జలాశయానికి నీళ్లు వచ్చే అవకాశం లేదు. మానేరువాగు వెంట ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, ఇల్లతకుంట, బోయినపల్లి మండలాలు, ఇటు వీర్నపల్లి, కోనరావుపేట, వేములవాడ మండలాల్లోని గ్రామాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటాయి. ముస్తాబాద్, వేములవాడ మండలాల్లో ఇసుక తవ్వకాలతో సమీపంలోని పంట పొలాలకు నీరందక ఎండుతున్నాయని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. గ్రామస్థాయిలోనే పంచాయతీ నిర్వహించి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. వాగుల్లోని పాత నీటి పథకాలకు సైతం భూగర్భ జలాల ముంపు పొంచి ఉంది. భగీరథ పథకం ద్వారా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఇవే ప్రత్యామ్నాయం.

తనిఖీలు చేపడతాం ప్రభుత్వం అనుమతి ఉన్న చోటనే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. అందులోనూ పరిమితికి మించి తవ్వకాలు, తరలించడం చేపడితే చర్యలు తప్పవు. రెవెన్యూ, పోలీసు, గనులశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు చేపడతాం. ప్రభుత్వం స్థానిక అవసరాలకు ఉచిత ఇసుక పాలసీ తీసుకురాబోతుంది. దానిపై ఇంకా పూర్తిస్థాయిలో విధి విధానాలు రావాల్సి ఉంది. అప్పటి వరకు వే బిల్లులను జారీ చేయాలి.క్రాంతికుమార్, ఏడీ గనులశాఖ

పంట ఎండిపోతోందిమూలవాగు పక్కనే మూడెకరాలు వరిసాగు చేశా. ఈ నెల భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. ఓవైపు వేసవి ఎండలు, వాగులో ఇసుక తవ్వకాలు మరో కారణం. పంట చేతికొచ్చేవరకు అధికారులు ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వకుండా ఉంటే బాగుండేది. ఇప్పటికే సగం పంటకు నీరందని పరిస్థితి ఉంది.లంక పెద్దరాజయ్య, వీర్నపల్లి

# కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం...!!

**కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావ్ ల వల్లే తెలంగాణ ఆగమైంది**

**కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి**

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో బిఆర్ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్ లో చేరిక**







**ఖానాపూర్ ఏప్రిల్ 1(ప్రభాత సమాచారం )**
కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని,రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఖానాపూర్ మండలంలోని సోమర్ పెట్ గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు రూపాయి 500లకె గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు కానీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. సరస్వతి కెనాల్ ద్వారా రైతులకు నీళ్ళు ఇచ్చి ఆదుకుంటామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందన్నారు. త్వరలో గ్రామ గ్రామాన తిరిగి సమస్యలు తెలుసుకుని, ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. అనంతరం బీఆర్ఎస్, బిజెపి నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కార్యకర్తలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను శాలువాతో సత్కరించారు.

అగ్గి మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

ఖానాపూర్ మండలంలోని తార్లపాడు గ్రామంలో అగ్గిమల్లన్న ఆలయంలో ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించారు.

**పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

ఖానాపూర్ మండలం మస్కపూర్ గ్రామంలో గల పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను పెట్టుకొని ఉన్నతంగా చదవాలన్నారు. మహిళా సాధికారత కోసం నీస్సి స్కూల్ యాజమాన్యం కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. స్కూల్ యాజమాన్యం ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దొనికేనీ దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మునిసిపల్ చైర్మన్ రాజుర సత్యం, మండల జనరల్ సెక్రెటరీ షాబీర్ పాషా, ఎంపిటిసి జంగిలి శంకర్,కార్యక్రమలో గ్రామ అధ్యక్షులు బిక్కు నాయక్, కొదరి నరేష్, మాజీ సర్పంచ్ చిన్న రాజన్న, కాన్సిరమ్ నాయక్, అంబజి, మాజీ సర్పంచ్ సుతారి రాజేశ్వర్, మాజీ ఎంపిటిసి వెంకటేష్, బాలంబిమ్మన, తదితరులు,నాయకులు కార్యకర్తలు,పాల్గొన్నారు.



# చివరి ఆయకట్టు వరకు వ్యవసాయానికి సాగు నీరు

**జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి తమ్మి రెడ్డి**



**వీణవంక ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
మండలము లోని చివరి ఆయకట్టు గ్రామమైన లస్మక్కపల్లి గ్రామం వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోసాగునీరు అందుతుందని.జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మి రెడ్డి అన్నారు.సోమవారం మండలములోని లస్మక్కపల్లి గ్రామములో సమ్మిరెడ్డి రైతుల తో కలిసి వరి మొక్క జొన్న పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా తుమ్మేటి సమ్మె రెడ్డి రైతులతో మాట్లాడుతూ సాగు నీటి సమస్య ఉందా అని రైతులను అడిగారు. రైతులు మాట్లాడుతూ ఎలాంటి సమస్య లేదని సాగు నీరు సమయానికి అందుతున్నాయని రైతులు తెలిపారు. అనంతరం తుమ్మేటి సమ్మిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో లిక్కర్ స్కాం.ఫోన్ ట్యాపింగ్ ను పక్క దారి పట్టించేందుకే మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి నియోజవర్గంలో

కావాలనే పంటలు ఎండబెట్టించి నాటకాలను ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి 3 నెలలు కాలం కాక పోయిన ప్రతిపక్షం గగ్గోలు పెట్టడం సిగ్గు చేటన్నారు.తెలంగాణలో నీరు లేకుండా ఒక గుంట పొలం కూడా ఎండలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి.కెసిఆర్ అబద్ధాల మాటలు తెలంగాణ ప్రజలు నమ్మరని గుర్తు పెట్టు కావాలన్నారు.వారి వెంట పిసిసి మెంబర్ కర్ర భగవాన్ రెడ్డి.మాజీ మార్కెట్ డైరెక్టర్ నల్లా కోండాల్ రెడ్డి. నాయకులు దాసరపులక్ష్మణ్. సమ్మి రెడ్డి.సమ్మయ్య. కోండాల్ రెడ్డి.ఇంద్రారెడ్డి. రాజిరెడ్డి. కోమల్ రెడ్డి.సమ్మయ్య.తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు

# పార్లమెంట్ ఎన్నికలలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

**ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి శిశుసంక్షేమ, పంచాయతీరాజ్ శాఖల మంత్రి సీతక్క**



**ఇచ్చోడ ఏప్రిల్ 1(ప్రభాత సమాచారం)**
పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలు సైనికుల్లా వని చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చార్జి మంత్రి శిశుసంక్షేమ, వంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఇచ్చోడ మండలంలో కేంద్రంలో వంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశా నిర్దేశంచేశారు. మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కోసం కృ షి చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. గృహ జ్యోతి వథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు రూ.500లకే గ్యాన్ అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ రా జ్యాం స్థావన కోసం రాహుల్ గాంధీ, ప్రధాన మంత్రి చేసే లక్ష్యంగా కార్యకర్త సైనికునిలగా వని చేయాలని అన్నారు. మన అడబిడ్డగా ఆత్రంసుగుణను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రేస్ పార్టీలో చేరిన ఆత్రం భాస్కర్ ను మంత్రి సీతక్క సన్మానించారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే వేద్మ బోజ్జు వటేల్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేష్, డిసిసిబి చైర్మన్ అడ్డి బోజారెడ్డి,బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, ఆత్రం భాస్కర్, భోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భో డ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ వసంత్, జెడ్పిటిసిలు గోక గణేష్ రెడ్డి, మల్లెపూల నరసయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రె సిడెంట్ భూవల్లీ శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి ప్రవులు చందర్ రెడ్డి, మహిముద్ ఖాన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంచి కంట్ల ఆశమ్మ, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదం లక్ష్మీ రాజేశ్వర్,బోత్ నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ ఫిషరీస్, సేవాదళ్ ఇ తర అనుబంధ విభాగాల నాయకులు, బోత్ ఇచ్చోడ బజార్హత్నూర్ గుడిహత్నూర్ సిరికొండ నేరడిగొండ తాంసి తలమడు గు బీంపూర్ మండలాల అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్ ఏప్రిల్ 1(ప్రభాత సమాచారం)**
జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన ప్రత్యామ్నయ చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాల్లో ట్యాంక ర్ల తో నీటిని సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా పాలనాదికారి రాజర్షి షా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కి వివరించారు.సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో తాగునీరు , యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలఏర్పాటు, వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, వేసవి కాలంలో త్రాగునీటి కి సంబందించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మిషన్ భగీరథ ద్వారా నిరందించాలని అన్నారు. త్రాగునీటి సరఫరా ను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాలని సిఎస్ కలెక్టర్లకు సూచించారు. పట్టణాలలో, గ్రామాలలో త్రాగునీటి సరఫరా ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని , క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి, వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఆన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో అవసరమైన మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, నాణ్యమైన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ అంశంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు టెంట్లు ఏర్పాట్లు చేయాలని అన్నారు. వానాకాలం 2023-24 కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాలో రైస్ మిల్లుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, ప్రతిరోజు రైస్ మిల్లులు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిచేలా చూడాలని, సి.ఎం.ఆర్, రా రైస్ డెలివరీ పై కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకుని రావడం, అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మత్తులు, తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం కల్పన వంటి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు , క్షేత్రస్థాయిలో మరోసారి పాఠశాలలను తనిఖీ చేసి పక్కగా ప్రతిపాదనలు రూపొందించాలని సీఎస్ , ప్రతి మండల స్థాయిలో పాఠశాల మౌళిక వసతుల కల్పన పై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవో, పాఠశాల నిర్వహణ కమిటీ లో ఉన్న స్వశక్తి మహిళా సంఘాలతో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో వడ దెబ్బల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఇప్పటికే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదు అవుతున్నాయని, ఏప్రిల్, మే నెలలో ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ,వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ఉపాధి హామీ పనులను ఉదయం పూట నిర్వహించాలని, ఉపాధి హామీ పనుల నిర్వహణ సమయంలో కార్మికులకు అవసరమైన నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అన్నారుఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు, తదితరుల పాల్గొన్నారు

# అనుమానాస్పద స్థితిలో యువకుని మృతి

**తాండూర్,ఏప్రిల్1(ప్రభాత సమాచారం)** తాండూర్ మండల కేంద్రంలోని ఐబి సుభద్ర కాలనీకి చెందిన ఎండి అజ్గర్(33) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తాండూర్ సీఐ కె కుమారస్వామి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం అబ్బాపూర్ ఓసి టు సమీపంలోని కాలువలో ఒక మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం తెలియడంతో తాండూర్ సీఐ తన సిబ్బందితో సంఘటన స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని కాలువ నుండి బయటకు తీయించి విచారణ చేపట్టారు. మృతుడు ప్రైవేటు బస్సు డ్రైవర్ గా పనిచేస్తూ జీవిస్తున్నాడని, గత రెండు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఈ వ్యక్తేనా అనే కోణం లో అతని కుటుంబ సభ్యులను సంఘటన స్థలం వద్దకు పిలిపించి విచారణ చేయించగా చనిపోయిన వ్యక్తి తన భర్తని మృతిని భార్య గుర్తించింది.అనంతరం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాండూర్ సీఐ తెలిపారు.





# రూ.3500 కోట్ల పన్ను నోటీసులు.. కాంగ్రెస్‌కు భారీ ఊరట

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముందు వరుస ఐటీ నోటీసులతో సతమతమవుతన్న కాంగ్రెస్ పార్టీకి భారీ ఊరట లభించింది. దాదాపు రూ.3500 కోట్ల పన్ను డిమాండ్ల నోటీసులకు సంబంధించి ప్రతిపక్ష పార్టీపై ప్రస్తుతం ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోమని ఆదాయపు పన్ను విభాగం వెల్లడించింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు ఐటీ శాఖ తెలిపింది. పన్ను డిమాండ్ల నోటీసులను సవాల్ చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఐటీ విభాగం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. "కాంగ్రెస్ రాజకీయ పార్టీ. ప్రస్తుతం దేశంలో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నందున ఆ పార్టీపై ఎలాంటి బలవంతపు చర్యలకు దిగబోం. దీనిపై తుది తీర్పు వచ్చేదాకా ముందస్తు చర్యలు చేపట్టం" అని తెలిపారు. అనంతరం ఈ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం జులై 24వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల ఐటీ విభాగం కాంగ్రెస్‌కు వరుసగా నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. 2017-18 నుంచి 2020-21 మదింపు సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీలతో కలిపి రూ.1,823 కోట్లు చెల్లించాలని గత శుక్రవారం నోటీసులిచ్చింది. అనంతరం 2014-15 నుంచి 2016-17 మదింపు సంవత్సరాలకు సంబంధించి మరో రూ.1744 కోట్లు కట్టాలని ఇంకో తాఖీదు పంపింది.

ఈ నోటీసుల ప్రకారం కాంగ్రెస్ పార్టీ మొత్తం రూ.3,567 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆదాయపుపన్ను బకాయిలు చూపించి కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల నుంచి ఐటీ అధికారులు రూ.135 కోట్లను రికవరీ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. లోక్‌సభ ఎన్నికల వేళ "పన్ను ఉగ్రవాదం"తో ప్రధాన ప్రతిపక్షాన్ని ఆర్థికంగా కుంగదీయాలని కేంద్రం కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ ఆరోపించింది.

# తెలంగాణ: దంచికొడుతున్న ఎండలు.. వడగాలుల హెచ్చరిక



హైదరాబాద్: తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణ లోని పలు జిల్లాలో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం నుంచే ఉక్కపోత తోడవుతోంది. ఈ క్రమంలో.. రాష్ట్రానికి వడగాలుల ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశ ముండడంతో.. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే బయటకు రావాలని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మూడు రోజులపాటు వడగాలులు వీచే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక.. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు వడగాల్పుల హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణలో 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే 5 రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

# లౌకికవాదాన్ని నిలబెట్టుకోవాలనే కాంగ్రెస్‌లో చేరా: కడియం శ్రీహరి

హనుమకొండ: భాజపా మతోన్మాదాన్ని అడ్డుకోవడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లౌకికవాదాన్ని నిలబెట్టుకోవాలనే ఆ పార్టీలో చేరినట్లు చెప్పారు. తన కుమార్తె కావ్యతో కలిసి హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును ఆయన కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు అధికార పార్టీలో చేరినట్లు కడియం తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మరోసారి మోసం చేసేందుకే భారాస అధినేత కేసీఆర్ వస్తున్నారని విమర్శించారు.

కాళేశ్వరం ఆయనకు ఏటీఎంలా మారిందన్నారు. భారాస ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోలేదని ఆరోపించారు.



రాష్ట్రంలో వచ్చిన కరవుకు గత ప్రభుత్వమే కారణమన్నారు. ఆ పార్టీ నేతలు ధర్నా చేస్తే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు.

# కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



దిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన భారాస ఎమ్మెల్సీ కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ ఏప్రిల్ 4కు వాయిదా పడింది. తన కుమారుడి పరీక్షల దృష్ట్యా ఈ నెల 16 వరకు బెయిల్ మంజూరు చేయాలని మార్చి 26న ఆమె రౌస్ అవెన్యూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కవిత పిటిషన్‌పై సమాధానం చెప్పాలని న్యాయస్థానం ఈడీకి నోటీసులు జారీ చేస్తూ.. విచారణను వాయిదా వేసింది. గత నెల 15న హైదరాబాద్‌లోని తన నివాసంలో కవితను ఈడీ అరెస్టు చేసి మరుసటి రోజు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన సంగతి తెలిసిందే. ముందుగా ఈడీ 10 రోజుల కస్టడీకి కోరగా.. న్యాయస్థానం ఏడు రోజులకు అనుమతి ఇచ్చింది. అనంతరం మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరగా.. మూడు రోజులకు అనుమతించింది. ఈడీ కస్టడీ మార్చి 26న ముగియడంతో.. అదే రోజు కోర్టులో దర్యాప్తు సంస్థ అధికారులు ఆమెను హాజరు పరిచారు. ఆ తర్వాత కవితకు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో తిహాడ్ జైలుకు తరలించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




# లోక్‌సభ ఎన్నికల తర్వాత భారాస మిగలదు

## కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమే: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో నీటి పారుదల రంగాన్ని సర్వనాశనం చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. జిల్లాల పర్యటనలో మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాటా అబద్ధమేనని చెప్పారు. భారాస ప్రభుత్వం రైతులకు పంట బీమా కూడా ఇవ్వలేదన్నారు. దేశంలోనే పంట బీమా లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. విద్యుత్ విషయంలో ఆ పార్టీ ఏదో గొప్పలు సాధించామని చెప్పడం అబద్ధమన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. "కేసీఆర్ అధికారంలోకి వచ్చాక పంట బీమాను రద్దు చేశారు. భారాస హయాంలో నష్టం జరిగితే రైతులకు బీమా పరిహారం ఇవ్వలేదు. నీటిపారుదల రంగం గురించి మాట్లాడే అర్హత కేసీఆర్‌కు ఉందా? కమీషన్ల కోసం ప్లాన్, డిజైన్లు లేకుండా ప్రాజెక్టులు నిర్మించారు. కాళేశ్వరంపై మాట్లాడేందుకు ఆయన సిగ్గుపడాలి. భారాస ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టు.. వారి హయాంలోనే కూలిపోయింది. ఒక్క పిల్లరే కుంగిందని.. అమెరికాలో బ్యారేజీ కుంగలేదా? అని కేసీఆర్ ఎదురు ప్రశ్నిస్తున్నారు. కాళేశ్వరం కోసం విద్యుత్ ఖర్చే ఏడాదికి రూ.10వేల కోట్లు అవుతోంది. ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగించేందుకు ఆయనే అంగీకరించారు. మాజీ సీఎం అబద్ధాలు చెప్పడాన్ని ప్రజలు గమనించాలి. ఎన్టీపీసీకి సహకరించి ఉంటే 4వేల మెగావాట్ల విద్యుత్ ఉచితంగా వచ్చేది. 24 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు ఖర్చు గురించి ఆలోచించడం లేదు. ఒక్కో ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

# కాకరేపుతున్న ఆ నాలుగు స్థానాలు.. తెరపైకి కొత్త వ్యక్తి



ఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నిలువరించిన నాలుగు స్థానాలు కాకరేపుతున్నాయి. మాకు కావల్సిందంటే.. మాకు కావాల్సిందేనంటూ బడా నేతలు పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలోనే సందట్లో సడేమియాలాగా కొత్త వ్యక్తులు సీన్‌లోకి ఎంటర్ అవుతున్నారు. నేడు తెలంగాణలో మిగిలిన 4 స్థానాలపై కాంగ్రెస్ కసరత్తు నిర్వహిస్తోంది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సాయంత్రం భేటీ కానుంది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేయనుంది. ఇప్పటికే మిగతా13 స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ నాయకత్వం ఖరారు చేసింది. ఖమ్మం సీటు కోసం ముగ్గురు మంత్రుల కుటుంబాలు పోటీ పడుతున్నాయి. పోటీ పడుతున్న వారిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబం నుంచి తుమ్మల యుగంధర్ ఉన్నారు. ఈ ముగ్గురిని కాదని కాంగ్రెస్ నేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కొత్తగా తెరపైకి వచ్చారు. మంత్రుల కుటుంబాలను కాదని వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కు టికెట్ ఇచ్చే అవకాశం ఉంది. వరంగల్ స్థానం కోసం జరుగుతున్న సుదీర్ఘ కసరత్తు నిర్వహించనుంది. డి. సాంబయ్య, డా. పరమేశ్వర్, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ సహా పలువురు నేతలు టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కడియం చేరిక నేపథ్యంలో వరంగల్ సీటుపై ఆసక్తి పెరిగింది. మాదిగ వర్గానికి ఈ సీటు ఇవ్వాలని మాదిగ జేఏసీ డిమాండ్ చేస్తోంది. కడియం కుటుంబాన్ని మాదిగ వర్గంగా పరిగణించకూడదని విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ నుంచి ప్రవీణ్ రెడ్డి, సంతోష్ కుమార్ టికెట్ ఆశిస్తున్నారు. తీన్మార్ మల్లన్న పేరు తాజాగా తెరపైకి వచ్చింది. హుస్నాబాద్ స్థానాన్ని అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్ కోసం ప్రవీణ్ రెడ్డి వదులుకున్నారు. ముగ్గురిలో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతోందన్నది ఆసక్తికరంగా మారింది. అసదుద్దీన్ ఓవైసీ పోటీ చేస్తున్న హైదరాబాద్ స్థానం కోసం టెన్నిస్ స్టార్ సానియా మీర్జాతో పాటు షానవాజ్ తబుసం పేర్లను పరిశీలిస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఈ నాలుగు స్థానాలతో పాటు సికింద్రాబాద్ అభ్యర్థి మార్పుపై చర్చించే అవకాశం ఉంది.

దానం నాగేందర్ పేరును అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఎమ్మెల్యే పదవికి దానం నాగేందర్ రాజీనామా చేయలేదు. ఆయనను మార్చే పక్షంలో పరిశీలనలో బొంతు రామ్మోహన్ సహా మరికొందరి పేర్లున్నాయి.

# ఇదే మా హెచ్చరిక.. సీఎం రేవంత్‌కు హరీష్‌రావు లేఖ

హైదరాబాద్: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫీజులను భారీగా పెంచడం వల్ల నిరుద్యోగులకు జరుగుతున్న నష్టం గమనించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం టెట్ ఫీజులను భారీగా పెంచడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే రాయితీని విస్మరించడం విద్యార్థులు, నిరుద్యోగును మోసం చేయడమేనన్నారు. అనేక కష్టాలకు ఓర్చి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు, నిరుద్యోగుల నుండి అధిక ఫీజులు వసూలు చేయడం బాధాకరం. దీనిని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని హరీష్‌రావు లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెట్ ఒక పేపర్ రాసినా, రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు తీసుకున్నారు. ఈ ఏడాది ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్లకు రూ.2,000 ఫీజుగా వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులు సీబీఎస్ఈ నిర్వహించే సీటెట్‌తో పోల్చితే డబుల్‌గా ఉండటం గమనార్హం. మాటను నిలబెట్టుకోవాలి.



వెంటనే టెట్ ఫీజులు తగ్గించాలని బిఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే విద్యార్థులు, నిరుద్యోగుల తరుపున పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నాం" అని హరీష్‌రావు తెలిపారు.

# పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా?: భట్టి



దిల్లీ: సూర్యాపేటలో భారాస అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందించారు. భారాస నేతలు భారీగా కాంగ్రెస్‌లో చేరుతుంటే ఆయన తట్టుకోలేపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటల్లో కొంచెమైనా వాస్తవాలు లేవన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. పదేళ్లు సీఎంగా ఉన్న వ్యక్తి ఇంతలా దిగజారుతారా?అని ప్రశ్నించారు. కట్టుకథలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నించారని మండిపడ్డారు. మైక్ సమస్య వస్తే..కరెంట్ కోతలు అంటూ అబద్ధాలు మాట్లాడారని చెప్పారు.

**సరఫరా లేకుంటే విద్యుత్ వినియోగం ఎలా జరిగింది? :** "బొగ్గు లభించే ప్రాంతానికి 350 కి.మీ. దూరంలో యాదాద్రి పవర్ ప్లాంట్ పెట్టారు. దూరంగా ఉండటం వల్ల థర్మల్ ప్లాంటుకు బొగ్గు సరఫరా కోసం భారీగా ఖర్చువుతోంది. పర్యావరణ అనుమతులు పొందటంలో ఆలస్యం వల్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తెలంగాణకు 4 వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వాలని విభజన చట్టంలోనే ఉంది. విభజన చట్టం ప్రకారమే రాష్ట్రానికి ఎన్టీపీసీ మంజూరయ్యింది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి ప్లాంట్ నిర్మించాల్సి ఉంది. కానీ, కమీషన్ల కోసం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి పవన్ ప్లాంట్ చేపట్టారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా నమోదైంది. సరఫరా లేకుంటే ఇంత వినియోగం ఎలా జరిగింది?

**చర్చకు రావాడానికి సిద్ధం :** ఏప్రిల్, మే నెలలోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. దేశమంతా గ్రిడ్ అనుసంధానం 2013లోనే యూపీఏ ప్రభుత్వం చేసింది. పదేళ్లలో పాలనలో కేసీఆర్ ఎన్ని హామీలు నెరవేర్చారో చెప్పాలి. అందరికీ రెండు పడకగదుల ఇళ్లు నిర్మించి ఇచ్చారా?ప్రతి మండలంలో బాలబాలికలకు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, ప్రతి నియోజకవర్గంలో కేజీ టూ పీజీ విద్యాలయాలు నిర్మించారా? దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేశారా? రైతులకు రుణమాఫీ ఐదేళ్లలో పూర్తి చేశారా? వర్షాకాలంలో అధికారంలో ఉన్నది ఎవరు? వాననీటిని రిజర్వాయర్లలో నింపే పరిస్థితి లేకుండా చేసిందెవరు? ప్రపంచంలోనే అత్యద్భుతం అని చెప్పిన కాళేశ్వరం కుంగిపోయింది. అన్ని లెక్కలతో చర్చకు రావాడానికి నేను సిద్ధం" అని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.

# ముసలి నక్కలన్నీ కాంగ్రెస్‌లో జాయిన్ అవుతున్నాయి..

హైదరాబాద్: ఎంపీ కేశవరావుకు మతి భ్రమించినట్లుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మిలియన్ మార్చ్‌లో కేశవరావును కొడిగుడ్లతో కొట్టిన ఘటనలను గుర్తు చేసుకోవాలి. ఇవాళ పాట లేదు మాట లేదని కేశవరావు మాట్లాడుతున్నారని.. ఆయన భాష ఎవరికి అర్థం కాదన్నారు. కేశవరావు బిడ్డ అంటే ఎవరో తెలియదని.. అలాంటి ఆమెకు కేసీఆర్ మేయర్ పదవి ఇచ్చారన్నారు. పాటకు చరిత్ర లేకపోతే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా ఎలా తీసుకున్నారని రసమయి ప్రశ్నించారు. తెలంగాణ సంస్కృతిని అవమానించడం కేకేకు సరికాదన్నారు. కేశవరావు వెంటనే కళాకారులకు క్షమాపణ చెప్పాలని రసమయి డిమాండ్ చేశారు. లేదంటే ఆయన ఇంటి ముందు ధూం ధాం నిర్వహిస్తామన్నారు. ఓట్ల కోసం గద్దర్ అన్నను వాడుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచి తెలంగాణ బతుకుల మీద విషం చిమ్ముతూనే ఉందన్నారు. కడియం కావ్యకు బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం లేదన్నారు. కడియం శ్రీహరి ఏ బడిలో చదువుకున్నారో.. ఎక్కడ బడి చెప్పారో ఎవరికి తెలియదన్నారు. కడియం శ్రీహరి మాదిగ ద్రోహి అని.. మాదిగ జాతి అంటేనే ఆయనకు కళ్ల మంట అని రసమయి పేర్కొన్నారు. కడియం శ్రీహరి వైఖరి వల్లనే తాడికొండ రాజయ్య, ఆరూరీ రమేష్ వెళ్ళిపోయారని రసమయి అన్నారు. మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు సీటు ఇవ్వకపోతే చావు డప్పు కొడుతామన్నారు. వరంగల్‌లో కడియం శ్రీహరిపై చావు డప్పు కొడుతామని హెచ్చరించారు. ముసలి నక్కలన్నీ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నాయని రసమయి అన్నారు. మా పార్టీ ఆదేశిస్తే తాను వరంగల్ నుంచి పోటీ చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు ఎన్ని సీట్లు ఇచ్చారనే దానిపై మందకృష్ణ మాదిగ అన్న ఎందుకు మాట్లాడం లేదని రసమయి ప్రశ్నించారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660